# అభిరుచులు

రచన :
"పుష్యమి"

(గత సంచిక తరువాయి)

"యింత చిన్నవయసులో, అంత గొప్ప కళాకారుడయ్యాడా నా తమ్ముడు!—ఎంత అదృష్టవంతురాలు మా అమ్మ!" తన తమ్ముడు స్వల్పకాలంలో కీర్తి సంపాదించినందుకు తన్మయుడై పోయాడు ఆనందంతో! తమ్ముడిని తల్చుకుని గర్వపడ్డాడు రవి! అందరికీ ఆ పేపరులో పడిన తమ్ముడి ఫోటో చూపించాడు.

*  *  *  *

"ఏవిటిరోయ్! యిలా చెప్పకుండా దిగావ్?" టెడ్డింగూ, పెట్టెతో రిక్షాదిగిన తమ్ముడి రాకకి ఆశ్చర్యపడి అడిగింది రామలక్ష్మి!

"నిన్ను చూచిచాలా రోజులయిందని, కోరి ఈ ఊరు కేంపు (camp) వేయించుకున్నా నక్కా!" అన్నాడతను.

రామలక్ష్మి తమ్ముడి పేరు కృష్ణమూర్తి! అరడుగుల పొడుగూ, దానికి తగ్గశరీరం! అతన్ని చూస్తూంటే హిందీ సినిమాల్లో 'షేక్ముక్తార్' జ్ఞాపకం వస్తాడు! జబర్దస్తీగా మాట్లాడే స్వభావం! వయసు పాతికమించకపోయినా చూడటానికి రామలక్ష్మికి అన్నగారిలా వుంటాడు.

కృష్ణమూర్తిది 'సినిమా రిప్రజంటేటివ్' ఉద్యోగం! ఫిలిమ్ రిప్రజంటేటివ్‌లకి చేతినిండా డబ్బేట! అందుకేనేమో కృష్ణమూర్తి చాలాటిప్ టాప్‌గా, నీటైన డ్రస్ వేశాడు.

వస్తూవస్తూ, అక్కగారికో సిలుకు చీరకొని తెచ్చాడు కృష్ణమూర్తి! ఎందుకురా యిప్పుడు?" అంటూనే చీర అందుకుని, ఆ చీరచూసి మురిసిపోయింది రామలక్ష్మి.

"మొన్న గుంటూరు కేంపులో కొన్నాను ఎలా వుంది?" అడిగాడు కృష్ణమూర్తి.

"ఎలాగుందేమిటి?—చాలా బాగుంది! అవున్లె. నాలుగూళ్లూ తిరిగే వాడవ్! నాణ్యమయినవే తెస్తావుగాని, నాసిరకం తెస్తావా!" అనినవ్వింది రత్నమ్మ.

ఆరోజు సుందర్రామయ్యా, రామలక్ష్మి, రవిని, లక్ష్మిని తీసుకుని కృష్ణమూర్తితో సినిమా కెళ్లాడు.

కృష్ణమూర్తి వచ్చి నాలుగురోజులయింది! ఈ నాలుగు రోజుల్లోనూ కృష్ణమూర్తితో బాగా స్నేహం సంపాదించాడు! కృష్ణమూర్తిని విడిచి పెట్టకండా తిరుగుతూ, సినిమాల గురించీ, అతను చేసే ఉద్యోగం గురించి అడిగి పూర్తిగా తెలుసుకున్నాడు!

"ఏవండీ? రిప్రజెంటేటివ్ ఉద్యోగం సంపాదించడానికి, ఏం పాసవాలండీ?" అనడిగాడు.

"స్కూలు ఫైనల్ దాకా చదివితేచాలు!"

"పాసవాలా?"

"అవకపోయినా ఫరవాలేదు! కరస్పాండెన్సు జరపడానికి సరిపడే నాలడ్జి (knowledge) వుంటే చాలు!"

"ఏమండీ! అయితే నాకీ ఉద్యోగం యిప్పించకూడదు పోనీ?"

"అంత తేలికా! దానికెంతో అనుభవం కావాలి!"

"మీ దగ్గర నేర్చుకుంటూ!"

"యిప్పటినించీ నీకు ఉద్యోగం ఎందుకోయ్? చదువుకునే వాడవ్!...ఆ స్కూలు ఫైనలు పూర్తి చెయ్యి, అతర్వాత చూద్దాంలే!" అని చెప్పాడు కృష్ణమూర్తి.

కృష్ణమూర్తి పదిహేను రోజుల తర్వాత యింకో ఊరు కేంపు వెళ్ళిపోయాడు.

రవికి చదువంటే పూర్తిగా అయిష్టత ఏర్పడింది! ఉద్యోగం చెయ్యాలనీ, సంపాదించాలనీ కాంక్ష ఏర్పడింది.

వారంరోజులు ఆలోచించి, ఆలోచించి, ఆఖరికి సుందర్రామయ్యతో చెప్పాడు రవి, తనకిక చదవాలని లేదనీ, కృష్ణమూర్తితో చెప్పి తన్ని ఉద్యోగంలో చేర్పించమని కోరాడు.

"మరి వాడు ఈ ఊళ్లో వుండగా నాతో ఎందుకు చెప్పావు కావు? వాడితో యిక్కడే మాటాడి, వాడితో బాటే పంపుదునుగా!' అన్నాడు సుందర్రామయ్య!

"తమ్ముడు చెప్పాడు కదండీ! ఆ ఉద్యోగంలో చేతినిండా డబ్బేనని! వాడికి చదవాలని లేనపుడు, మనమేంచేస్తాం! యివాళే తమ్ముడికి ఉత్తరం వ్రాసి వదేయండి, వాడు పంపమంటే పంపవచ్చు, యింకా లక్ష్మికి రెండేళ్లదాకా బాధలేదు, ఈ లోపులో ఆ ఉద్యోగంలో నన్నాను దొక్కుకుంటాడు!" అని రామ

లక్ష్మి కూడా రవికోరికకి మద్దతిచ్చింది! ఆమె రికమండేషను తీసెయ్యటానికి లేదుగా.

ఆమర్నాడే కృష్ణమూర్తికి ఉత్తరం వ్రాశాడు సుందర్రామయ్య! — వాడిక చదవనంటున్నాడనీ, వాడికి ఎలాగయినా ఉద్యోగం చేయాలని వుందనీ, రిప్రజెంటేటివ్ వుద్యోగం మీద మోజుగా ఉన్నాడనీ, తప్పకుండా నౌఖరీ చూచి, పంపమంటే వెంటనే పంపుతాననీ. వాడు తనకి కాబోయే అల్లుడని, ఈ విషయంలో కాస్త శ్రద్ధవహించమనీ, ఆ ఉత్తరంలో రాశాడు.

రామలక్ష్మి రికమండేషన్ బాగా పనిచేస్తుందని, ఓకార్డు కృష్ణమూర్తికి ఆమెచేత కూడా వ్రాయించాడు రవి.

కృష్ణమూర్తి దగ్గిర్నించి రెండు రోజుల తర్వాత జవాబు వచ్చింది.

“అథమం స్కూలు ఫైనలు పూర్తిచేస్తేనన్నా బాగుంటుంది, పోనీ. వాడికిక చదవాలని లేనప్పుడు మీరు మాత్రం ఏంచేస్తారు! ప్రస్తుతం వెంటనే ఉద్యోగం యివ్వరు, ముందు ఓ రెండు నెలలు పని నేర్చుకోవాలి! అంచేత, నాతోటే వుండి పని నేర్చుకుంటాడు! వాణ్ణి బెజవాడ వెంటనే పంపండి, నాకు ఓవారం రోజుల్లో మళ్లీ యింకో ఊరు కేంపు వేస్తారు, ఈ లోపులో పంపుతే వాణ్ణి పంపండి!” అని రాశాడు కృష్ణమూర్తి.

అదిచూచి రవి ఎగిరి గంతేశాడు! ఆరోజే బయల్దేరి వెళ్ళి హనుమంతరావునీ, అత్తమ్మనీ ఒసారి చూచి వచ్చాడు!

తిరిగివచ్చి మర్నాడే బయల్దేరి బెజవాడ వెళ్ళిపోయాడు రవి!

కృష్ణమూర్తి రవిని తనతో రాజమండ్రి కేంపుకి తీసుకు వెళ్లాడు! ఆ కేంపులో ఉన్న నెల్లాళ్లూ రవికి అన్ని విషయాలూ నేర్పాడు! కరస్పాండెన్సు ఎలా చేయాలో, — పార్టీ దగ్గరనుంచి డబ్బు వసూలు చేయడంలోని కష్టసుఖాలూ, అన్నీ కృష్ణమూర్తి నుండి నేర్చుకున్నాడు! రవి,

ఆనెల తర్వాత బెజవాడ తిరిగి వచ్చాక, ఆఫీసులో మానేజరుతో మాట్లాడి, రవికి ఉద్యోగం యిప్పించాడు కృష్ణమూర్తి! కృష్ణమూర్తికి ఆఫీసులో పలుకుబడి వుండడం మూలాన, రవికి ఉద్యోగం కోసం అంతగా ప్రయత్నం అక్కరలేక పోయింది!

బెజవాడలో ఓ సినిమా హాలుకి, అసిస్టెంటుగా వేసారు మొదట రవిని!

రవికి యిప్పుడెంతో ఆనందగా ఉంది! తానూ ఓ ఉద్యోగస్తుడయినందుకు ఉబ్బిపోయాడు! సినిమాలంటే చెవి తెగ్గోసుకునే రవికి, ఆ సినిమాలో ఉద్యోగం సంపాదించడం చాలా సంతోషంగానూ, ఉత్సాహంగానూ వుంది! నటనపట్ల అనురక్తికల రవి, తన నటనకు మెరుగులు దిద్దుకునేందుకు మంచి సావకాశం కలిగింది! అగ్రశ్రేణి సినిమా నటుల ఆదర్శంగా, నటనలో కొత్త ధనం సంపాదించడానికి, సాధన చెయ్యడానికి; ఈ ఉద్యోగం చాలా ఉపకరిస్తోంది!

* * *

ఆరు నెలలు యాంత్రికంగా గడిచిపోయాయి!

సీతారామశర్మ రఘుకి సంగీతం కూడా చెప్పిస్తున్నాడు; సంగీతంలో కూడా రఘుని పూర్తిగా ప్రవీణుణ్ని చేస్తేనే కాని నిదురపోనని శపథం పట్టాడు! అతని ఆశయాలకు అనుగుణంగా, రఘు ఉత్సాహంతో, చురుగ్గా నేర్చుకుంటున్నాడు సంగీతం!

ఒక విషయాన్ని చెపుతుంటే, మరి రెండు విషయాలు ముందే గ్రహిస్తున్నాడు రఘు సంగీతంలో అతనికున్న సహజ శక్తి చూచి, రఘు సంగీతం మాష్టరు యింకా శ్రద్ధగా నేర్పసాగాడు!

రఘు స్కూలు ఫైనలు పాసయే నాటికి, అటు శాస్త్రంలోనూ, హరికథలు చెప్పటంలోనూ కూడా చాలవరకూ ప్రతిభ సంపాదించాడు! అప్పటి కతనికి పదహారో ఏడు వచ్చింది! అంత చిన్న వయస్సులోనే, రెండు కళలలో విశేష విజ్ఞానాన్ని సంపాదించాడు!

నిజంగా రఘు సహజ శక్తి అభివృద్ధి చెందటానికి, శర్మ సహాయ, సహకారాలు, భగవంతుడు ప్రసాదించిన వరాల్లా అతని కెంతో మేలు చేశాయి! రోజూ లేవగానే, శర్మకి నమస్కరించందే, మరో కార్యక్రమానికి పోడు రఘు! శర్మ అంటే అతని కెంతో భక్తి! తానెన్నడూ ఊహించని ఒక ఉన్నత స్థితికి తనను తెచ్చిన శర్మకి తానెంతేనా ఋణపడి వుంటానని అనుదినం; — అనుక్షణం అనుకుంటూనే వుంటాడు!

స్కూలుఫైనలు పాసయిన రఘుని యింక పైకి చదివించదలచుకోలేదు శర్మ! సంగీతపు అంచులు చేరేవరకూ. రఘుకి పట్టుదలతో ఆ విద్య నేర్పించ దలుచుకున్నాడు!

అప్పుడప్పుడు కచేరీలు కూడా చేయిస్తున్నాడు రఘు చేత అవకాశం వచ్చినప్పుడల్లా!

* * *

రవికి ఉద్యోగం ఖాయం చేసి, విశాఖపట్నం క్యాంపుకి పంపారు కంపెనీవారు!

యిలా నాలుగూళ్లూ తిరగడం మూలాన లోకంలోని వివిధ రకాల మనుష్యుల వింత మనస్తత్వాలు అర్థమవుతున్నాయి రవికి; ఎన్నో కొత్త కొత్త విషయాలు, అనుభవాల ద్వారా అవగాహన మవుతున్నాయి!

ఒక సంవత్సరం పూర్తయేసరికి, రవి శారీరకంగా చాలా మార్పు చెందాడు! అవయవాలు దృఢమై, నవయవ్వనపు కాంతిలో మెరుస్తున్నాయి! నూనూగు మీసాల నూతనత్వం, అతని ముఖానికి కొత్త కళ తెచ్చింది! చూచేవారికి మత్తు కలగించగల అందచందాలు అతనిలో విరిశాయి!

మధ్య మధ్య నాటకాలలో పాత్రలు అక్కడక్కడ ధరిస్తూండడం మూలాన, నలుగురు కళాకారులతోటీ పరిచయం ఏర్పడింది!

రవి నాటక ప్రదర్శన చూచిన ఒక నాటక సంస్థ యజమాని తన సంస్థలోకి రమ్మని రవిని ఆహ్వానించాడు! నెలకి నూరు రూపాయ లిస్తానన్నాడు!

రవికి అంతకంటే కావలసిందేముంది? తన నటనా కౌశల్యాన్ని యింకా అభివృద్ధి చేసుకోవటానికిది మంచి అవకాశం!—ఆ నాటక సంస్థలో జీవితానికి చేరటానికి అంగీకరించి, తన రిప్రజెంటేటివ్ ఉద్యోగానికి రాజీనామా యిచ్చేశాడు రవి!

ఇక ఊళ్లుతిరిగే బాధకూడా లేదు! బెజవాడలోనే స్థిరంగా వుండచ్చు! - ఏదేనా రూము దొరికేదాకా, నాటక సంఘం గదిలోనే ఉందామని నిశ్చయించి, రూముకోసం వేట ప్రారంభించాడు రవి!

ఆఖరికి ఒక డాబాలో అరుగుమీద గది సంపాదించాడు! ఆ డాబా గాంధీనగరంలో వుంది! ఆ డాబాలో ఒక ఆడావిడా, ఆమె కూతురు తప్ప యింకెవరూ లేరు! ఆస్తి ఉన్న వాళ్ళే!

ఆ యింటావిడ కూతురు పేరు, కమల అనీ; కాలేజీలో పి. యు. సి. చదువుతోందనీ; ఆమె తప్ప, ఆ యింటావిడ కెవరూ లేరనీ తెలుసుకున్నాడు రవి!

వారంరోజులదాకా కమలను చూడటం తటస్థపడేలేదు రవికి! ఓనాడు సాయంత్రం వేళ చల్లగాలికని డాబామీకి వెళ్ళాడు రవి! ఓ పావుగంట గడిచాక, పైకి కమలకూడా వచ్చింది! తవినిచూచి సిగ్గుగా, తిరిగి వెళ్ళిపోయింది!

రవి ఆమెవైపు చూచాడు! - పదహారు ఏళ్ళు నిండిన కమల, నిగనిగ మెరిసే శరీరం; కనులను దాటిన నల్లటి కాటుక లేఖలు, నవయువ్వనంలో వంపులుతీరిన ఆమె శరీర సౌష్టవం! పిరుదులుదాకా వున్న ఆమె వాలుజడ!- రవికళ్ళు ఒక్కసారి మెరిశాయి!

'ఎంత అందంగా వుంటుంది కమల!' అనుకున్నాడు ఆమెను చూస్తూ!

కమల మెట్లుదిగి వెళ్ళిపోబోతోంది! - రవి పిల్చాడు!

'ఏమండీ!'-

ఆమె వెనుతిరిగి; ఆగింది!

'ఏదో పనిమీద వచ్చినట్టున్నారు! వెళ్ళిపోతున్నారేం?' అన్నాడు!

'అబ్బే!...ఏమీ లేదండీ!...ఊరికేనే! గాలికోసం వచ్చా! అంతే!...' అని తిరిగి వెళ్ళబోయింది!

(సశేషం)


కథాంజలి
[చక్కని కథల మాసపత్రిక]
స్థాపితం. 1938.

| | |
|---|---|
| విడి ప్రతి | — 25 న. పై. |
| సంవత్సర చందా | — రూ. 4-00 |

(ప్రత్యేక సంచికలతో సహా)
అన్ని హిగ్గిన్ బాతమ్స్, స్వదేశమిత్రన్ బుక్ స్టాల్స్ లలోనూ దొరుకును.